



## పేద దళితుల భూములపై అగ్రకులాల పెత్తనం

- వార్తకు స్పందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల
- తక్షణ చర్యలకు అధికారులకు ఆదేశం



**సైదాపురం, డిసెంబర్ 14, ప్రభాతవార్త** పేద దళితుల భూములపై అగ్రకులాలు పెత్తనం చేస్తున్నారని వార్త దినపత్రికలో ఆదివారం వచ్చిన కథనంపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వెంటనే స్పందించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులకు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో నెల్లూరు ఆర్డీవో నాగసంతోషి అనూష సైదాపురం తహసీల్దార్ ఎం.సుభద్ర, ఆదివారం పాలూరు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని వారు తెలిపారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, డిసెంబరు 14, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 6708 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయం లో 74. 568 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎస్ఎఫ్‌సికి 100, పెన్నా డెల్టా 0, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి 2650 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 100.114 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## మక్తాపురంలో 95 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి ఆనం





**సంగం డిసెంబర్ 14 ప్రభాతవార్త** సంగం మండలం మక్తాపురం గ్రామంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి 95 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 63 లక్షల రూపాయాలతో నిర్మించిన సిమెంట్‌రోడ్లును మంత్రి ప్రారంబించారు. అలాగే 32 లక్షలతో గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన గ్రామంలో నిర్మాణంలో వున్న శివాలయాన్ని సందర్శించారు. సీనియర్ నాయకులు చెన్నూరు మోహన్‌రెడ్డి,గ్రామ ఉపసర్పంచ్ యు. సునీల్‌రెడ్డి, ఆద్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు .ఈ సందర్బంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతు మక్తాపురం గ్రామంలో డ్రైన్‌లకు మరో 75 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మరో పదిలక్షల రూపాయాలు సిమెంట్ రోడ్లుకు అవసరమని చెప్పగా వెంటనే స్పందించిన మంత్రి పదిలక్షల రూపాయాలు కూడా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతు కూటమి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి దూసుకుపోతుం దని అన్నారు. రాయలసీమ నంద్యాలలో దేవాదాయశాఖకు సంబందించి కర్నూలు జోనల్ కార్యాలయం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కేంద్రం పది వేల కోట్లు ఇచ్చి 20 శాతం మీరు పెట్టుకోండి అంటే దానిని ఉపయోగించులేని అసమర్దులు అని ఆయన విమర్శించారు. గడిచిన 5 సంవత్సరాలలో వైసిపి పాలనలో రాష్ట్రం అవినీతి మయమని విమర్శించారు. అన్నమయ్య ప్రాజక్టు దెబ్బతినిపోయి సోమశిల ప్రాజక్టుపైన పడితే ఆవరద తాకిడికి అనేక గ్రామాలు నీట మునిగితే నష్టపరిహారం ఇవ్వలేదని విమర్శించారు. సోమశిల డ్యామ్ దెబ్బతింటే పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సోమశిలకు పెద్దఎత్తున నిధులు తెచ్చి మరమ్మత్తులు చేయిస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అన్ని రంగాలలో ముందుకు దూసుకొని పోతుందని అన్నారు. ఆత్మకూరులో 100 పడగల హాస్పటల్‌ని మరో 150 పడకలు పెంచి 250 పడకల హాస్పటల్‌గా నెల్లూరుకి దీటుగా చేస్తానని హామి ఇచ్చారు. నేడు ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మరోవైపు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మరోవైపు విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ కేంద్ర ప్రభుత్వం పెద్దలను కలిసి పెద్దఎత్తున నిధులు తీసుకొని వచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని ఆయన కొనియాడారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఒ పావనీ, కిమ్స్ హాస్పటల్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ తాళ్లూరు గిరినాయుడు, సోమశిల ప్రాజక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి, ఆత్మకూరు డిఎస్‌పి వేణుగోపాల్, రవీంద్రరెడ్డి, తహసిల్దారు సోమ్లానాయక్, ఎంపిడిఒ షాలెట్, మండల పార్టీ అద్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, పడమటిపాళెం నీటి సంఘం అద్యక్షులు గంగపట్నం చంద్రశేఖరయ్య, అన్నారెడ్డిపాళెం నీటి సంఘం అద్యక్షులు సూరా శ్రీనివాసులురెడ్డి, వెంగారెడ్డిపాళెం గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, సీనియర్‌నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, సంగం పిఎసిఎస్ అద్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాస్‌యాదవ్, దువ్వూరు పిఎసిఎస్ అద్యక్షులు బండా హరికిషోర్‌రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి మెట్టు విజయకృష్ణారెడ్డి ,పగడాల రఘురామయ్య, మక్తాపురం నాయకులు సురేంద్ర, రమేష్, కుష్వంత్‌రెడ్డి, జెండాదిబ్బ నాయకులు పర్వతాల వెంకటరత్నం, నెల్లూరు పెంచలయ్య,కంచర్ల నారాయణ నాయుడు, దువ్వూరు నాయకులు జడపల్లి దయాకర్‌గౌడ్ పంచాయితీ రాజ్ ఇఇ,డిఇ సుధాకర్‌రెడ్డి, ఏఇ రామయ్య ,ఇరిగేషన్ ఏఇ వినయ్‌కుమార్ , నరేష్ చౌదరి, మర్రిపాడు నాయకులు జనార్దన్‌రెడ్డి, హరిరెడ్డి, మక్తాపురం సెక్రటరీ అరుణకుమారి, అన్నారెడ్డిపాళెం సెక్రటరీ మల్లికార్జున, సచివాలయం సిబ్బంది, ఎఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, టిడిపి,బిజెపి,జనసేన నాయకులు పాల్గోన్నారు.

## మేయర్ పదవికి రాజీనామా చేసిన పొట్లూరి స్రవంతి

- అధికారికంగా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అందించిన రాజీనామా లేఖ



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 14, ప్రభాతవార్త** నెల్లూరు నగర కార్పొరేషన్‌లో శనివారం నగర మేయర్ పొట్లూరి స్రవంతి మీడియా సమావేశం నిర్వహించి రాజీనామాకు సంబంధించి మేయర్ స్రవంతి ప్రకటన చేశారు. అధికారికంగా ఆదివారం జిల్లా కలెక్టర్‌ని కలిసి రాజీనామా పత్రాన్ని అందిస్తానని మేయర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషను మేయర్ రాజీనామా లేఖను కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అందించిన స్రవంతి జయవర్ధన్ తరుపున ప్రతినిధి. ఈ మేరకు కలెక్టర్ క్యాంప్ కార్యాలయ డిటి హాజరత్‌కు రాజీనామా లేఖ అందించారు.

## మాజీ మంత్రి వైసిపి నేత బొత్సపై మంత్రి ఆనం ఫైర్



**సంగం డిసెంబర్ 14 ప్రభాతవార్త** సంగం మండలం మక్తాపురం గ్రామంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వైసిపి నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శలను తిప్పికొట్టారు. వైసిపి ప్రభుత్వం అప్పులు చేసిపోతే కూటమి ప్రభుత్వం వడ్డీలు కడుతుందని అన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేశారని విమర్శించారు. వైసిపి పాలనలో రాష్ట్రానికి ఒక్క ప్రాజక్టు అయినా వచ్చిందా అని విమర్శించారు. ప్రభుత్వంలో పెన్షన్ తీసుకుంటున్న ఉద్యోగులందరికి మొండి చెయి చూపించి 32 వేల కోట్లు నిధులు బకాయిలు పెట్టారని గుర్తు చేశారు. గత వైసిపి పాలనలో తెచ్చిన వేల కోట్లు అప్పులు వాళ్ళ పౌడర్లు, స్నోలరూపంలో సోకులకు వాడారని ఎద్దేవ చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలో అన్నమయ్య ప్రాజక్టు కొట్టుకొని పోతే పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ విమర్శలు చేయడం హస్యాస్పదంగా ఉందని అన్నారు. వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణ ,మాజీ మంత్రి కన్నబాబు జగన్ మాయలో పడి దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. జగన్ అసమర్దత పాలన వల్ల ప్రభుత్వ ఉద్యోగులు బకాయిలు విషయంలో విసిగి పోయి కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర కాలంలో రోడ్లు,సంక్షేమపథకాలు, పారిశ్రామిక రంగం,విద్యా సంస్దలు తెస్తు ఐటి రంగాన్ని అభివృద్ధి చేశామని అన్నారు. నేడు ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మరోవైపు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మరోవైపు విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ కేంద్ర ప్రభుత్వం పెద్దలను కలిసి పెద్దఎత్తున నిధులు తీసుకొని వచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని ఆయన కొనియాడారు.వైసిపి నేతలు ఇకనైనా ఇటువంటి చౌకబారు అరుపణలు మానుకోవాలని హితవు పలికారు.ఈకార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఒ పావనీ, కిమ్స్ హాస్పటల్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ తాళ్లూరు గిరినాయుడు, సోమశిల ప్రాజక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి, ఆత్మకూరు డిఎస్‌పి వేణుగోపాల్, రవీంద్రరెడ్డి, తహసిల్దారు సోమ్లానాయక్,ఎంపిడిఒ షాలెట్, మండల పార్టీ అద్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి,పడమటిపాళెం నీటి సంఘం అద్యక్షులు గంగపట్నం చంద్రశేఖరయ్య,అన్నారెడ్డిపాళెం నీటి సంఘం అద్యక్షులు సూరా శ్రీనివాసులురెడ్డి,వెంగారెడ్డిపాళెం గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి,సీనియర్‌నాయకులు కర్నాటి రవీంద్ర రెడ్డి ,సంగం పిఎసిఎస్ అద్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాస్‌యాదవ్,దువ్వూరు పిఎసిఎస్ అద్యక్షులు బండా హరికిషోర్‌రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి మెట్టు విజయకృష్ణారెడ్డి, పగడాల రఘురామయ్య, మక్తాపురం నాయకులు సురేంద్ర,రమేష్, కుష్వంత్‌రెడ్డి, జెండాదిబ్బ నాయకులు పర్వతాల వెంకటరత్నం, నెల్లూరు పెంచలయ్య, కంచర్ల నారాయణనాయుడు, దువ్వూరు నాయకులు జడపల్లి దయాకర్‌గౌడ్ పంచాయితీ రాజ్ ఇఇ, డిఇ సుధాకర్‌రెడ్డి, ఏఇ రామయ్య, ఇరిగేషన్ ఏఇ వినయ్‌కుమార్, నరేష్ చౌదరి, మర్రిపాడు నాయకులు జనార్ద న్‌రెడ్డి, హరిరెడ్డి, మక్తాపురం సెక్రటరీ అరుణకుమారి, అన్నారెడ్డిపాళెం సెక్రటరీ మల్లికార్జున, సచివాలయం సిబ్బంది,ఎఎన్‌ఎంలు,అంగన్‌వాడీ టీచర్లు, టిడిపి,బిజెపి,జనసేన నాయకులు పాల్గోన్నారు.

## ఆర్డీవో విచారణపై పాలూరు గ్రామంలో దళితులు తీవ్ర అసంతృప్తి



**సైదాపురం, డిసెంబర్ 14, ప్రభాతవార్త** మండల పరిధిలోని పాలూరు గ్రామంలో దళిత రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో కొంత మంది చేస్తున్న దౌర్జన్యాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నెల్లూరు ఆర్డీవో నాగసంతోషి అనూష, సైదాపురం తహసీల్దార్ ఎం.సుభద్రకు ఆదేశాలు జారీ చేయడంతో ఆదివారం పాలూరు గ్రామానికి చేరుకుని ఆర్డీవో నాగసంతోషి అనూష విచారణ చేపట్టారు. అయితే ఈ విచారణ తీరుపై బాధితులైన దళిత రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విచారణ నిమిత్తం వచ్చిన ఆర్డీవో నాగసంతోషి అనూషకి ప్రభుత్వం సాగు చేసుకునేందుకు ఇచ్చిన మా భూముల విషయంలో సొసైటీ అధ్యక్షుడు అమ్మినేని సుబ్రహ్మణ్యంనాయుడు మా దగ్గర లీజుకు తీసుకున్న వేమసాని సుబ్బరామయ్య తదితరులు అనేక ఇబ్బందులు పెట్టి జామాయిల్ కొట్టుకోకుండా చేసి బెదిరించి మా దగ్గర డబ్బులు వసూళ్లు చేశారని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా ఆమె మా మాటలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహారిస్తూ.. మా మాటలను పెడచెవిన పెట్టారని వారు తెలిపారు. మేము ఎంత వేడుకున్నా మాటలను వినిపించుకోకుండా, మీరు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్తూ హడావుడిగా వెళ్ళిపోయారని రైతులు వాపోయారు. మాకు మేము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలతో పాటు మా దగ్గర అగ్రకులాల వారు బెదిరించి 41మంది రైతుల దగ్గర వసూళ్లు చేసిన సుమారు రూ.12లక్షల 30 వేలను కూడా మాకు ఇప్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. అయితే ఆర్డీవో చేపట్టిన విచారణపై మేము విశ్వాసం కోల్పోయామని, జిల్లా కలెక్టర్ స్వయంగా మా గ్రామానికి చేరుకుని క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అన్యాయాన్ని పరిశీలించి తమకు న్యాయం చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు.

## గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి



**కోట, డిసెంబర్ 14 ప్రభాతవార్త** గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని గూడూరు జెఎసి కన్వీనర్ ధశరాధరామిరెడ్డి ప్రభుత్వాని కోరారు. ఆదివారం కోటలోని రెడ్డి కళ్యాణమండపంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆ మేరకు ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపకపోతే గూడూరును జిల్లా కేంద్రం చేయడానికి అన్ని రకాల ఆర్థిక వనరులు, సిలికా, ఆక్వా, క్వార్జ్, క్రిస్ సిటీ, సముద్రతీరం, నిమ్మ ఎగుమతులు, త్వరలో ఏర్పాటు కానున్న దుగరాజపట్నం పోర్టు, సాగరమాల రోడ్డు, పెద్ద విద్యాసంస్థలు ఉన్నాయని చెప్పారు. గతంలో ఎన్నికల సమయంలో స్వయాన ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని, అదేవిధంగా లోకేష్‌బాబు యువగళం పాదయాత్ర సమయంలో కోటలో ఇదే హామీ ఇచ్చారని చెప్పారు. సామాన్య ప్రజలు తిరుపతికి వెళ్లాలంటే 120కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తుందని చెప్పారు. ఆ మేరకు ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు, దళిత సంఘాలు, మీడియా, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు, వ్యాపార సంఘాలు, కార్మిక సంఘాలు యుటిఎఫ్,ఉపాధ్యాయు సంఘాలు పాల్గొన్నాయి.సమావేశంలో యుటిఎఫ్ నాయకులు జనార్దనం, మువ్వల మనోహర్, పనబాక హేమంత్, పాల మల్లి తదితరులు ఉన్నారు.నూతనంగా కన్వనర్ పునబాక జనార్దన్, కో కన్వీనర్ ఊయ్యాల రామకృష్ణరావు, జాయింట్ సెక్రటిరిగా సాయి హేమంత్,సెక్రటిరిగా మీజారు మాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటిరి మీజారు మల్లికార్జున్‌రావు,కోశాధికారి జిమ్మి ప్రసాద్,యుటిఎఫ్, మండలశాఖ అధ్యక్షులు మువ్వలమనోహర్,యుటిఎఫ్ సినియర్ నాయకుడు జన్దానం,తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 14, ప్రభాతవార్త** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ మీకోసం.ఏపి.జివోవి.ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చును. ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఆత్మకూరులో పండుగ వాతావరణంలో "రైతన్నా మీకోసం"



**ఆత్మకూరు, డిసెంబరు 14, ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో ఆదివారం పండుగ వాతావరణంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఎఎంసి చైర్మెన్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరయ్యారు. ముందుగా మంత్రి 'ఆనం' ఈకార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మంత్రి ఆనం సమక్షంలో ఆత్మకూరు వ్యవసాయమార్కెట్‌కమిటీ చైర్మెన్, సభ్యులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మెన్‌లు, సభ్యులు, నీటి సంఘాల చైర్మెన్‌లు, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ రైతు ప్రస్థానంలో ప్రధానభాగస్వామ్య వ్యవస్థలైన వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, సాగునీటి సంఘాలను పునరుద్ధరించి పూర్వ వైభవం తీసుకొస్తున్నా మన్నారు. అన్ని సంఘాలకు చైర్మెన్‌లు, సభ్యులుగా రైతులనే నియమిస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో డైరెక్టర్ పదవులు పొందిన వారిని ఈసందర్భంగా అభినందించారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజల్లో ఇంధన పొదుపు ప్రాధాన్యతపై అవగాహన

జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం



**నెల్లూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త-వైద్యం** విద్యుత్ భవన్‌లో జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం మీడియా ప్రతినిదులతో మాట్లాడుతూ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు-2025 సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో ఇంధన పొదుపు ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా 15వ తేదీన విద్యుత్ భవన్ నుండి కస్తూరిబా కళాక్షేత్రం వరకు ఇంధన పొదుపు ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల శుక్రవారం జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జిల్లాలోని విద్యుత్ శాఖకు చెందిన అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని డివిజన్ల పరిధిలో వినియోగదారులకు అవగాహన కల్పించే విధంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ముఖ్య కూడళ్లు, ప్రజలు అధికంగా చేరే ప్రదేశాలలో ఇంధన పొదుపు సందేశాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్లను ప్రదర్శించడం అలాగే రెవెన్యూ కలెక్షన్ సెంటర్లలో వినియోగదారులకు పాంప్లెట్లు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. అదే విధంగా విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే విద్యుత్ పొదుపు అలవాట్లు పెంపొందించేందుకు ఎస్సే రైటింగ్, డ్రాయింగ్ వంటి పోటీ కార్యక్రమాలను జిల్లాలోని అన్ని డివిజన్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులు ఇంధన పొదుపు విలువను అవగాహన చేసుకుని సమాజానికి సందేశం ఇవ్వగలరని పేర్కొన్నారు. రైతులకు సంబంధించి కూడా విద్యుత్ వినియోగంలో పొదుపు, భద్రతా చర్యలు సమర్ధవంతమైన విద్యుత్ వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో విద్యుత్‌ను బాధ్యతాయుతంగా వినియోగించడం ద్వారా శక్తి వనరులను కాపాడుకోవచ్చని సూచించారు. ఇంకా జిల్లాలోని జనవిజ్ఞాన కేంద్రం(జేవీకే) ప్రతినిధులతో కలిసి జిల్లా వ్యాప్తంగా పూర్తి స్థాయిలో ఇంధన పొదుపు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించామని తెలిపారు. ప్రజలంతా ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఇంధన పొదుపును తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం పిలుపునిచ్చారు.

## మంత్రి సత్యకుమార్ యాదవ్

## 14, 15 తేదీల్లో నెల్లూరు జిల్లాలో పర్యటన

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈనెల 14,15 తేదీల్లో నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 (ఆదివారం) రాత్రి 8.00 గంటలకు తిరుపతి నుండి కారులో బయలుదేరి రాత్రి 10.00 గంటలకు నెల్లూరుకు చేరుకుని రాత్రి బస చేస్తారని తెలిపారు. 15వ తేది (సోమవారం) ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నెల్లూరు నగరంలోని హరినాథపురం, ముత్తుకూరు రోడ్ జంక్షన్ వద్ద నిర్వహించే అటల్ మోడీ సుపరిపాలన యాత్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు.అనంతరం మధ్యాహ్నం2.00 గం..లకు నెల్లూరు నుండి కారులో బయలుదేరి సాయంత్రం 4.00 గం..లకు ఒంగోలుకు చేరుకుంటారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## బండెన్నక బండి కట్టి:నెల్లూరుకి పోదంరారో

:జిల్లా కలెక్టర్ సార్‌ని కలుద్దాం రారో

:6 వరోజుకి చేరిన ఉద్యమం



**కలువాయి డిసెంబర్ 14 ప్రభాతవార్త** బండెన్నక బండి కట్టి నెల్లూరుకి పోదంరారో జిల్లా కలెక్టర్ సార్‌ని కలుద్దాం రారో అంటు కలువాయి మండలం జెఏసి నాయకులు కదం తొక్కారు.సోమవారం మండలంలోని అన్ని గ్రామల ప్రజలు జిల్లా కలెక్టర్‌ని కలిసి తిరుపతి వద్దు నెల్లూరు ముద్దు అన్న విషయాన్ని ఆయనదృష్టికి తీసుకొని వెళ్ళినున్నట్లు వారు తెలిపారు. 6 వరోజుకి చేరిన ఉద్యమంలో పాల్గోన్న సందర్బంగా పలువురు ఉద్యమకారులు మాట్లాడుతు ప్రభుత్వం స్పందించకుంటే గ్రామగ్రామన ఉద్యమం తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

## దువ్వూరులో ఫ్లెక్సెల వివాదం

డిడిపి,జనసేన నాయకుల మద్య ఘర్షణ



**సంగం డిసెంబర్ 14 ప్రభాతవార్త** సంగం మండలం దువ్వూరు గ్రామంలో ఫ్లెక్సిల వివాదం జరిగింది. జనసేన, టిడిపి నాయకుల మద్య ఘర్షణ జరిగింది.ఈ ఘర్షణలో జనసేన నాయకులు బానుకిరణ్‌కి, తెలుగుదేశం నాయకులు శ్రీనివాసులుకు గాయాలు అయ్యాయి. బాను కిరణ్ ఆత్మకూరులో ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.శ్రీనివాసులు నెల్లూరులోని ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారించేందుకు ప్రత్యేక చర్యలు




**కోవూరు డిసెంబర్ 14 ప్రభాతవార్త :** రూరల్ సబ్ డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారించేందుకు జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు ప్రత్యేక చర్య లు తీసుకుంటున్నట్లు రూరల్ డిఎస్పి.జి.శ్రీనివాసరావు తెలిపారు. కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతు ప్రధానంగా ద్విచక్ర వాహన చోదకులు , కారు , ఇతర వాహనాల డ్రైవర్లు మద్యం సేవించి వాహనం నడిపితే గట్టి చర్యలు తీసుకునేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతు పోలీసులకు పట్టుపడితే సంబ ందిత వాహన చోదకునికి న్యాయస్దానం పదివేల వరకు జరిమానా విదించే అవకాశం ఉందన్నారు. రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎటువంటి అవాంచనీయ సంఘటన జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రౌడియిజం తీవ్రమైన ఆర్దిక మోసాలు భూకబ్జా గంజాయి సంబందిత కేసులలో ముద్దాయిలుగా ఉన్న వారిపై రౌడిషిట్ ఓపెన్ చేసి వారి మీద ప్రత్యేక నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలపై మళ్ళీ మళ్ళీ పాల్గోనే వారిపై ప్రభుత్వ ఆదే శాల మేరకు పీడి యాక్ట్ కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకొని వారిని సంవత్సరం పాటు జైలుకు పంపడం జరుగుతుందన్నారు. చెడు వ్యసనాలకు బానిసై గ్యాంగ్‌గా ఏర్పడి తుంటరి చర్యలకు పాల్పడే వారి మీద కూడా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతందని ఈ సందర్బంగా ఆయన హెచ్చరి ంచారు. ఇటువంటి నేర కార్యకలాపాలు జరుగుతున్నట్లు ఎవ్వరైనా గమనించిన పక్షంలో వెంటనే సమాచా రాన్ని పోలీస్‌శాఖకు అందించాలన్నారు. సిఐ సుదాకర్‌రెడ్డి, ఎస్ఐ ముత్యాల రావు ఉన్నారు.

## ముగిసిన అయ్యప్పల అన్నదాన సేవా కార్యక్రమాలు



**కోవూరు డిసెంబర్ 14 ప్రభాతవార్త :** కోవూరులోని గ్రామ దేవత నాగవర్ప మ్మ దేవస్దానంలో గత 50 రోజులుగా హరిహరపుత్ర సేవా సమాజం ఆద్వ ర్యంలో నిర్వహిస్తున్న అయ్యప్పల ఉచిత అన్నదాన సేవా కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్బంగా ఆలయ ప్రాంగణంలో అయ్యప్పల ప్రత్యేక భజన కార్యక్రమాలను సాంప్రదాయబద్దంగా భక్తులు నిర్వహించారు. ఈసేవా సమాజం నిర్వాహకులు మల్లికార్జునరెడ్డి తదతర భక్త బృందం గత 13 సంవత్సరాలుగా ఈకార్యక్రమాన్ని ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగిస్తునే ఉన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## విద్యార్ధులకు ఘనంగా వీడ్కోలు




**అల్లూరు, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** శ్రీచైతన్య జూనియర్ కాలేజ్ నార్త్ మోపూరులోని అవుట్‌గోయింగ్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెట్ కె.శివకుమార్ డైరెకటర్ పి.ఖాజా రహమతుల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు,గీతాలు,నా టికలు వివిధ సాంస్కృతిక కార్యామకాలు అందరిని ఆకట్టుకొన్నాయి. కరస్పాండెంట్ శివకుమార్ మా ట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కఠినశ్రమ, ఆత్మవి శ్వాసంతో జీవితంలో ఉన్నత శిఖరాలను అదిరోహించాలన్నారు. అధ్యాపకులు విద్యార్థులను ఉద్దేశించి మా ట్లాడుతూ విద్యార్థుల సాధనను ప్రశంసిస్తూ భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. చివరలో విద్యార్థుల తమ జ్ఞాపకాలను పంచుకుటూ కాలేజ్ యాజమాన్యం మరియు అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

## చదువుకు మించిన ఆస్తి మరేదిలేదు



**కావలి,డిసెంబర్ 14 ప్రభాతవార్త :** చదువుకు మించిన ఆస్తి మరిది లేదని సంపద కరిగిపోతుంది కాని చదువు తరగని ఆస్తి అని ప్రముఖ పారిశ్రామిక వేత్త మోదరన్ టెక్స్‌టైల్స్ అధినేత మద్దల నరసింహారావు తెలి పారు. డిఆర్.విశ్వోదయ సేవా సమి తి ఆధ్వర్యంలో కావలి వెంగళరావు నగర్స్‌లోని కార్యాలయం నందు ఆదివారం డిఆర్.పేరుమీద 60మంది నిరుపేదల వృద్దులకు 60వేల విలువ చేసే బియ్యం వంటింటి సరు కులు ఒక్కొక్కరికి రూ.60వేలు చొప్పున పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మ ద్దల నరసింహారావు పాల్గొని మాట్లాడారు. డిఆర్ గొప్ప మానవతావాది, విద్యాప్రదాత అని ఆయన స్తాపించిన జవహర్‌భారతి కళాశాల పూర్వవిద్యార్థినైనందుకు గర్వంగా ఉందని తెలిపారు. విద్యతో పాటు సంస్కారం, సేవాభావం, మా గురువుల ద్వారా నేర్చుకున్నానని అదే నా అభివృద్ధికి పునాది అని తెలిపారు. డిఆర్ మార్గంలో కళాశాలలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వినయక్‌కుమార్‌రెడ్డి, విద్యాధరకుమా ర్‌రె డ్డిలకు అభినందనలు తెలిపారు. సేవాసమితిలోని వృద్దులకు స్వీయ నిదులతో నరసింహారావు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ వినాయకుమార్‌రెడ్డి, నరసింహారావు సతీమణి నీరజ, కోడలు దివ్య, సేవాసమితి ఛైర్‌పర్స న్ దొడ్ల లక్ష్మి, డైరెకటర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామక్రిష్ణ, సతీష్‌సింగ్, నర్సి ంగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కూలి మేస్త్రీ మృతి






**విడవలూరు, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** ఇతర ప్రాంతాల నుండి వచ్చే కూలీలకు పని కల్పిస్తున్న మేస్త్రీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన విడవలూరు మండలం రామతీర్థం గ్రామంలో చోటు చేసుకొంది. రామతీర్థం నుండి దండిగుంటవైపు వెలుతున్న కాంక్రీట్ మిక్సర్ లారీను బైక్ ముందుకు సాగించే క్రమంలో అదుపుతప్పి లారీ కింద పడిపోవడంతో కావలి వెంకటరమణయ్యపై లారీ వెళ్ళడంతో అక్కడిక్కడే మృతి చెందగా మరొకరికి స్వల్పగాయాలు అయ్యాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దండిగుంట గ్రామానికి చెందిన కావలి వెంకటరమణయ్య కొంతకాలం నుంచి బుచ్చిరెడ్డిపాలెం గ్రామం గాంధీనగర్‌లో నివాసం ఉంటూ కూలీలకు పనులు కల్పించేందుకు దండిగుంట గ్రామానికి వచ్చి ఇతర గ్రామాల్లో కూలీపనులు చేయించేవాడని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృత్యువాత విన్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. ఇంటి యజమాని ఇక లేరని మరణ వార్త వినడంతో గ్రామంలో ప్రజలను కలిచివేసింది. ప్రమాదానికి గురైన లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిమిత్తం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.నరేష్ తెలిపారు.

## గిరిజనులు సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలి



కావలి,డిసెంబర్ 14 ప్రభా తవార్త : గిరిజనులు పేదరికంతో విద్యా వైద్యానికి దూరంగా ఉం టూ నిరుపేదలుగా జీవిస్తు న్నా రని ప్రభుత్వ గిరిజన సంక్షేమ పథకాలపై అవగాహన మీకోసం స్వచ్ఛందసేవాసంస్థ వ్యవ స్థా పకు అధ్యక్షులు రాయపాటి దిలీ ప్ కుమార్ పేర్కొన్నారు. ముసు నూరు మర్రిచెట్టు గిరిజన కాలనీలోని కొత్త గిరిజన కాలనీ నందు ఆదివారం గిరిజనులకు మీకోసం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో వస్త్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా లోక్ అదాలత్ సభ్యులు మాలకొండ రెడ్డి పాల్గొని మాట్లాడారు. కాలనీలోని బడిబయట ఉన్న గిరిజన విద్యార్తులను పాఠశాలలకు పంపి విద్యాబుద్దులు నేర్పించాలని తల్లిదండ్రులకు తెలిపారు. గిరిజన కాలనీలో మైనర్ బాలికలకు వివాహాలు జరగకుండా నివారించాలని బాల్య వివాహాల నిషేదచట్టపంఐ అవగాహన పెంచుకొని యువతీ యువకులకు 18, 21వయస్సు వరకు ఆగి వివాహాలను నిర్వహించాలని తెలిపారు. మీ కోసం స్వచ్ఛంద సేవాసంస్థ కోఆర్డినేటర్ డేనియల్ బాబ్జి పాల్గొని గిరిజనులకు సేవలు అందించారు. ఈకార్యక్రమంలో కాలనీ పెద్దలు కత్తి చెంచులక్ష్మి, జయంపు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వృద్దుడు మృతి



**కావలి,డిసెంబర్ 14 ప్రభాతవార్త :** గుర్తు తెలియని వాహనం ఢీ కొని వృద్దుడు మృతి చెందడం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు కావలి మండలం, అల్లిగుంటపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారికి తూర్పువైపున ఉన్న అమరావతి డాబా పక్కన నేషనల్ హైవే పెన్సి ంగ్ వద్ద గుర్తుతెలియని వృద్దుడు (75)సంవత్సరాల వయస్సు గల వృద్దుడు మృతి చెందడం జరిగిందని తెలిపారు. మృతుడు ఆనారోగ్యం, ఆకలి దప్పికల వల్ల మృతి చెంది ఉంటాడని సర్వాయిపాలెం గ్రామ విఆర్ఓ శ్రావణి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడమైనదని తెలిపారు. ఫిర్యాదు మేరకు కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు

# క్రీడా ప్రతిభతో అత్యున్నత శిఖరాలు






**వింజమూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త** విద్యార్ధులు క్రీడా ప్రతిభతో అత్యున్నత శిఖరాలను అందుకోవచ్చని అపస్మా జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం వింజమూరులోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బి.మనోహర్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో అపస్మా మెగా స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన అపస్మా జిల్లా అధ్యక్షులు ఎన్.శ్రీధర్ ఎంఈఓ రమేష్ స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ మాలకొండయ్య నియోజకవర్గ అపస్మా అధ్యక్షులు కేవీ రత్నం గౌరవ అధ్యక్షులు మద్దూరు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి ఉదయ శంకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో ఆటలు కూడా అంతే అవసరం అని తెలిపారు. ఆటల వలన శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఆత్మ విశ్వాసం పెంపొందించి ఏకాగ్రత అలవడుతుందని క్రీడల్లో ప్రతిభ చూపితే ఉన్నత శిఖరాలను కూడా అధిగమించవచ్చని వారు తెలిపారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన ఆటల పోటీలను నిర్వహించారు. వాటిలో 100 మాటర్ల పరుగు పందెంలో డి.చైతన్య సిద్దార్థ(దుత్తలూరు), టి.మణి తేజ న్యూ ఇన్ఫాంట్ (కలిగిరి), కే.రక్షిత సాయి ఇన్ఫాంట్(కలిగిరి) 400 మీటర్ల పరుగు పందెంలో దుత్తలూరు విశ్వతేజకు చెందిన ఏ.విష్ణు వింజమూరు నేతాజీకి చెందిన అభిలాష్ ఆర్ మధుకర్లు లాంగ్ జంప్ నందు దుత్తలూరు విశ్వతేజకు చెందిన ఏ.విష్ణు వింజమూరు ఇన్ఫాంట్ జీసస్ కు చెందిన బి.జయప్రసాద్ రవి స్కూల్‌కు చెందిన ఎం.చరణ్ షాట్‌ఫుట్ నందు వింజమూరు నేతాజీకి చెందిన షేక్ షాద్, కలిగిరి పవిత్ర పాఠశాలకు చెందిన ఓ.శశిధర్, దుత్తలూరు సిద్దార్ధకు చెందిన డి.చైతన్య అలాగే జూనియర్ బాయ్స్ విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్‌కే ఆజాద్ అలీ నేతాజీ వింజమూరు లోకేష్ వింజమూరు సరస్వతి నేతాజీ వింజమూరు చెందిన పి.వరుణ్ 200 మీటర్ల పరుగు పందెంలో ఎస్‌కే ఆజాద్ అలీ నేతాజీ, కే.వంశీకృష్ణ, నేతాజీ దుత్తలూరు విశ్వతేజ, పి.నిఖిల్ లాంగ్ జంప్ నందు, సరస్వతీ స్కూల్‌కు చెందిన జి.లోకేష్, రవి స్కూల్‌కి చెందిన ఆర్.రాకేష్, దుత్తలూరు సిద్దార్ధకు చెందిన సీహెచ్ కార్తీక్ షాట్‌ఫుట్ నందు ఇన్ఫాంట్ జీసస్‌కు చెందిన విద్యార్థి వికాస్, కలిగిరి పవిత్ర పాఠశాలకు చెందిన డి.మహేందర్, దుత్తలూరు విశ్వతేజ్‌కు చెందిన పి.నిఖిల్, సీనియర్ బాలికల విభాగం నందు 100 మీటర్ల పరుగు పందెం నందు వివేకానందకు చెందిన ఎం.శరణ్య, శరణ్య నేతాజీకి చెందిన వి.లక్ష్మీ గాయత్రి దేవి 200 మీటర్ల పరుగు పందెంలో నేతాజీ స్కూల్‌కు చెందిన వి.లక్ష్మీ నిత్య శ్రీ హోలి ఏజెంల్స్ ఉదయగిరికి చెందిన కే.రిషిత, వివేకానందకు చెందిన ఎం.శరణ్య లాంగ్ జంప్ నందు, ఎస్.గాయత్రీ దేవి నేతాజీ డి.రేష్మ వివేకానంద ఎస్‌డి టార్జన్ మహియా విశ్వతేజ షాట్‌ఫుట్ నందు, రవి స్కూల్‌కు చెందిన ఏ.లావణ్య వివేకానందకు చెందిన టి.లక్ష్మీ యోగ్యత రేష్మ ఫైనల్స్ నందు 100 మీటర్ల పరుగు పందెంలో సీనియర్స్ విభాగం నందు మొదటి విజేతగా ఎం.శరణ్య, శ్రీ వివేకానంద నేతాజీకి చెందిన వి.లక్ష్మీ ఎస్.గాయత్రి దేవిలు నిలిచారు. 200 మీటర్ల పరుగు పందెంలో నేతాజీ స్కూల్‌కు చెందిన వి.లక్ష్మీ నిత్యశ్రీలు రష్మిత ఉదయగిరి హోలీ ఏంజెల్స్ చెందిన కే.రిషిత వివేకానందకు చెందిన ఎం.శరణ్య, లాంగ్ జంప్ నందు నేతాజీకి చెందిన ఎస్.గాయత్రీ దేవి వివేకానందకు చెందిన డి.రేష్మ విశ్వతేజకు చెందిన ఎస్‌డి మహియా షాట్ ఫుట్ నందు రవి స్కూల్ చెందిన ఏ.లావణ్య వివేకానందకు చెందిన బి.లక్ష్మీ యోగ్యత రేష్మ జూనియర్ బాలికల విభాగం నందు నేతాజీ కి చెందిన ఎస్.మనస్విని సరస్వతీ పాఠశాలకు చెందిన తిరుపతమ్మ, రవి స్కూల్ కు చెందిన లాస్య 200 మీటర్ల పరుగు పందెం నందు నేతాజీకి చెందిన ఎం.సాత్విక మనస్విని ఇన్ఫాంట్ జీసస్ నందు ఎల్.షర్మిల లాంగ్ జంప్ నందు నేతాజీ కి చెందిన ఎం.సాత్విక వివేకానందకు చెందిన జీవీ నిహారిక చెందిన వెంకట శ్రావణి త్రో బాల్ నందు సిద్దార్ధ స్కూల్‌కు చెందిన నందిని సరస్వతీ స్కూల్‌కు చెందిన సీహెచ్ మోక్షిత, ఎల్.చరిత విజేతలుగా నిలిచారు. వీరికి మెమోంటోలు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సెక్రటరీ పోలు అంకిరెడ్డి, కోశాధికారి ఎం.శ్రీనివాసులు నాయుడు, కరస్పాండెంట్స్ ఎస్.ఐజాక్, విష్ణువర్ధన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ఎన్.మహేష్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## బావిలో మహిళ మృతదేహం



**సీతారామపురం డిసెంబర్ 14 ప్రభాతవార్త** సీతారామపురంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే సమీపంలో గల పొలాలలో ఉన్న ఓ బావిలో ఆదివారం మహిళ మృత దేహం లభ్యమైంది.ఎస్ఐ శివకృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు సీతారామపురంలోని పడమటి వీధికి చెందిన ఆకుల బాగ్యమ్మ (28)గా గుర్తించారు. మృతురాలి భర్త మూడు రోజులక్రితం తన భార్య కనిపించడంలేదని ఫిర్యాదుచేయగా అప్పటి నుండి తమ సిబ్బందితో గాలిస్తున్నామని అన్నారు.మృతురాలి కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్ళడంతో అటువైపుగా బావిలో మృతదేహం తేలిఆడుతు కనిపించడంతో వెంటనే తమకు సమాచారం అందించడంతో ఉదయగిరి సిఐ వెంకట్రావ్‌తో కలిసి ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టరంకోసం ఉదయగిరికి తరలించామన్నారు.కుటుంబకలహాలతోనే బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానాలు ఉన్నాయని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వధువువరులను ఆశీర్వదించిన దుగ్గిరెడ్డి గురవారెడ్డి



**సీతారామపురం డిసెంబర్ 14 ప్రభాతవార్త** సీతారామపురంలోని హరిజనవాడకు చెందిన వైసిపి నాయకుడు పిడతల ప్రభాకర్ కుమారుడు పిడతల పవన్ ,వధువు శైలజాల వివాహ వేడుకలలో ఆదివారం సీతారామపురం మాజీ జడ్‌పిటిసి దుగ్గిరెడ్డి గురవారెడ్డి హాజరై వదువరులను ఆశీర్వదించారు.అనంతరం స్దానిక నాయకులతో కలిసి రాజకీయ అంశాలపై చర్చిలు జరిపారు.ఈకార్యక్రమంలో సీతారామపురం బిట్ 1 ఎంపిటిసి పిసి అల్లూరురాజు,సీనియర్‌నాయకులు శ్రీదర్‌రెడ్డి, దేవిశెట్టిపల్లి మాజీ సర్పంచ్ రేనాటి సుధాకర్‌నాయుడు, నాయకులు కాకర్ల కృష్ణ,గుండ్లపల్లి తిరిపాలు, మౌళాలు,పిడుగు నవీన్, తదితరులు పాల్గోన్నారు.

## టివిఎస్ ట్రస్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ



**కావలి,డిసెంబర్ 14 ప్రభాతవార్త :** టివిఎస్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ తోట వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా ఆదివారం క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్బంగా ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. తోట వెంకటేశ్వర్లు తన తండ్రి ఆశయాలను ప్రజలకు చేరువ చేసేందుకు తండ్రి కీర్తిశేషులు తోట వెంకటశేషయ్య పేరు మీద టివిఎస్ మెమోరియల్ చాటరిటబుల్ ట్రస్ట్ స్థాపించి ప్రజలకు నిరంతరం సేవలు చేయడం అభినందనీయమని తెలిపారు. ట్రస్టు మున్నందు అనేకసేవలు ప్రజలకు అందించాలని భవిష్యత్తులో తన సహాయ సహకారాలు ఎల్లవేలలా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మెన్ తోట వెంకటేశ్వర్లు, సెక్రటరీ గాదిరెడ్డి, హరినాథ్, మీకోసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్తాపక అధ్యక్షులు రాయపాటి దిఈప్‌కుమార్, ట్రస్టు శ్రేయాభిలాషులు రాచగిరి బాబ్జి, గునకల శివయ్య అమిరిశెట్టి హజరతయ్య, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి పివిఎన్ సుధాకర్‌రావు, విశ్రాంత జెబి కళాశాల లెక్చరర్ డి.సుబ్బారావు, తిరుమలశెట్టి లక్ష్మినారాయణ, మండవ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పీ4 కొనసాగించడంలో సంయక్తు సేవా సంస్తకు జిల్లాలో తొలి గుర్తింపు




**కావలి,డిసెంబర్ 14 ప్రభా తవార్త :** సిఎం చంద్రబా బు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసు కొచ్చిన పి4 అమలులో కావలి పట్టణానికి చెందిన సంయుక్త సేవా సంస్థకు అరుదైన గుర్తింపు లభించింది. ఈ సందర్బంగా కా వలి తుఫాన్ నగర్‌లోని సంయు క్త సేవాసంస్త కార్యాలయంలో 25బంగారు కుటుంబాలకు నిత్యవసర వస్తువులు బియ్యం అందజేయడంతోఒక నిరుపేద వృద్ద మహిళకు స్వయం ఉపాధి నిమిత్తం టిపిన్ అంగడి నిర్వహించుకోవడం కోసం అవసరమైన వస్తువులను అందజేశారు. అలాగే పి4స్ఫూర్తితో సంస్థ కార్యాలయంలో 70మంది బంగారు కుటుంబాలకు చెందిన పిల్లలకు ఉచిత ట్యూ షన్ ప్రారంభించడం జరిగింది. నియోకవర్గ పి4 కోఆర్డినేటర్ జి.సత్యానందం, సంయుక్త సేవాసంస్థ ద్వారా మా ర్గదర్శకులుగా బంగారు కుటుంబాలకు సేవలందిస్తున్న డాక్టర్ సుబ్బారెడ్డి, డాకటర్ పద్మజ, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ విజయభాస్కర్‌రావు, ప్రముఖ వ్యాపారవేత్త వేలూరు జయచంద్రనాయుడు, పచ్చిపులుసువెంకన్న, సభ్యులు పీఐ జాఫర్‌ఖాన్, ఎం.అజీత్‌బాబు, షేక్ ఖాదర్‌బాషా, నేలటూరి శివప్ర సాద్‌రెడ్డి, కె.సాయిచైతన్య, రామూర్తి,మల్లేశ్వరి, లిఖిత, సంస్థవ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, సీపీఏపీ యూనిట్‌సభ్యులు పాల్గొన్నారు.

## డివిజనల్ స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల నందు ఎంఈఓలు



**ఉదయగిరి, డిసెంబర్ 14, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి మండల స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలలో ఉదయగిరి మండల స్థాయి క్రికెట్ టీం, ఏఎస్పేట్ మండల స్థాయి టీమ్‌నకు సంఘం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కోరిమెర్ల పాఠశాల గ్రౌండ్ నందు ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారులు టి.వెంకటేశ్వర్లు అలాగే ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు పోటీలలో పాల్గొనే ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు.

## ఎన్‌సిసి క్యాండిట్లకు ఎ సర్టిఫికెట్లు పంపిణీ




**కావలి,డిసెంబర్ 14 ప్రభాతవార్త :** వెంగళరావు నగర్ శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాల నందు ఆదివారం ఎన్‌సిసి నావెల్ థర్డ్ ఆఫీసర్ టి.కొండారెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌సిసి క్యాండెట్లకు ఎ సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధులుగా 18వ వార్డు టిడిపి ఇన్‌చార్జ్ శానంహరి, శ్రీమేథా జూనియర్ కళాశాల అధ్యాపకులు పణిరాజ్‌లు మాట్లాడారు. విద్యార్థులు ఎన్‌సిసి ద్వారా క్రమశిక్షణ అలవాటు చేసుకొని మంచి పౌరులుగా ఎదిగి తల్లిదండ్రులకు పాఠశాలలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. పాఠశాలలో తన సబ్జెక్టులు తాను బోధిస్తూ ఈ ఎన్‌సిసి పనికూడా చేస్తున్నటువంటి ఏఎన్‌ఓ సేవలన కొనియాడారు. విద్యార్థులు ఎన్‌సిసి ద్వారా క్రమశిక్షణ అలవాటు చేసుకొని, చెడు అలవాటులకు దూరంగా ఉండి మంచి పౌరులుగా అభివృద్ది చెందాలని కోరారు. ఎన్‌సిసి అధికారి తిప్పిరెడ్డి కొండారెడ్డి మాట్లాడారు క్యాడెట్స్‌లో దేశభక్తి ఉండాలని ఎ సర్టిఫికెట్‌తోనే ఆగిపోకుడా అవకాశం ఉన్నంతవరకు బి, సి. సర్టిఫికెట్లు పొందే విధంగా కృషి చేయాలన్నారు.

## సరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ



**విడవలూరు, డిసెంబర్ 14 ప్రభాతవార్త :** మండలంలోని సరస్వతి విద్యానికేతన్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్ విద్యార్థులు బుచ్చిరెడ్డిపాలెం మండలం రేబాల హైస్కూల్ ఏపిపియు ఎస్ఎంఎ ప్రైవేటు యూనియన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో పాల్గొన్నారు. జూనియర్ త్రోబాల్ పోటీల్లో సిహెచ్ అక్షర జనని మొదటిస్థానం, జూనియర్ రన్నింగ్ 100మీటర్ రేసులో పి.హేమలత మూడో స్థానం కైవసం చేసుకొన్నారు. వీరికి త్వరలోనే జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఏపిపియు ఎస్ఎంఎ యూనియన్ వైస్ ప్రెసిడెట్ నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు నెలనూతల శ్రీధర్, ఎం.దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసపత్రాలు, బహుమతులు అందజేశారు. సరస్వతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కౌసల్య, ప్రిన్సిపాల్ మల్లికార్జున పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలను అభినందించారు.

## బీటీఏ అధ్యక్షుడుగా అబ్దుల్లా



**కందుకూరు డిసెంబరు 14 ప్రభాతవార్త** బ్రహుజన టీచర్సు అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్లా ఎంపికయ్యారు.ఈ మేరకు ఆదివారం ఒంగోలు హెచ్ఎం అసోసియేషన్ మీటింగ్ హాలు నందు జరిగిన ప్రకాశం జిల్లా బహుజన టీచర్స్ జిల్లా మహాసభలలో ఆయనను ఎంపికచేశారు. కందుకూరు మండలం పాలూరు ప్రైమరీ స్కూల్లో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న అబ్దుల్లా జిల్లాలో బిటిఏ స్థాపకులలో ఒకరిగా ఉంటూ కందుకూరు మండలఅధ్యక్షులుగా కందుకూరు డివిజన్ అధ్యక్షులుగా నెల్లూరు జిల్లాలో కలిసి ఉన్నప్పుడు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా పనిచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు మరోవైపు సామాజిక అవగాహనతో సామాజిక సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం నిబద్ధతతో పనిచేయనున్నట్లు తెలిపారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అబ్దుల్లాను బీటీఏ సీనియర్ నేత కల్లగుంట మోహన్ రావుతోపాటు పలువురు అభినందించారు.

## ఎల్‌విప్రసాద్ వైద్యశాలచే కంటి పరీక్షలు



**కందుకూరు డిసెంబరు 14 ప్రభాతవార్త** కందుకూరు పట్టణంలోని ఆది ఆంధ్ర కాలనీ ఎల్వీ ప్రసాద్ కంటి హాస్పిటల్ వారి చేత ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు.ఈ పరీక్షలను గ్రామములోని 154 మందిపాల్గొన్నారు.అందులో పురుషులు 57 మంది స్త్రీలు 97మంది కావడం గమనార్హం. ఈ కార్యక్రమానికి సహకరించినటువంటి ఎల్వి ప్రసాద్ కంటి హాస్పటల్ సిబ్బందికి,ఆది ఆంధ్ర కాలనీ గ్రామ పెద్దలకు, సహాయ సహకారాలు అందించినటువంటి గ్రామ యువతకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఉదయగిరి జిల్లా సాధన కమిటీ 19వ తేదీ సమావేశంకు పిలుపు



**ఉదయగిరి, డిసెంబర్ 14, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి జిల్లా సాధన కమిటీ ఆదివారం 19వ తేదీ సమావేశానికి నాయకుడు హాజరు కావాలని పిలుపు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉదయగిరి రెవెన్యూ డివిజన్ సాధన కొరకు పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ త్వరగా పూర్తి చేయాలని ఉదయగిరి నుండి నందవరం వరకు డబల్ రోడ్డు వేయాలని డిమాండ్ల పైన ఉదయగిరి సీతారాంపురం దుత్తలూరు, వరిగుంటపాడు, ముఖ్య కార్యకర్తలతో రాజకీయాలకు అతీతంగా కార్యచరణ రూపొందించుట కొరకు శుక్రవారం 19వ తేదీ ఉదయగిరిలో సమావేశం అవ్వాలనిముఖ్య బాధ్యులకు ఆహ్వానం పలకడానికి ఆదివారం ఉదయగిరి సీతారాంపురం వరికుంటపాడు, దుత్తలూరు మండలాలకు సంబంధించిన బాధ్యులకు కుమ్మిత శ్రీనివాసులురెడ్డి, గాజులపల్లి, రామిరెడ్డి, షేక్ దస్తగిరి అహ్మద్‌పై మండలాలు తిరిగి ఆహ్వానం పలకడం జరిగింది.

## 108లో ప్రసవం - తల్లి ,బిడ్డ క్షేమం



**అనంతసాగరం ,డిసెంబరు14(ప్రభాతవార్త:** మండలంలోని లింగంగుంట గ్రామానికి చెందిన పి.నారాయ ణమ్మ ఆదివారం ఉదయం పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108కి సమాచారం ఇవ్వగా వెంటనే వచ్చిన అంబులెన్స్ హాస్పిటల్‌కి తీసుకొని వెళుతుండగా మార్గ మధ్యంలోనే నారాయణమ్మ ప్రసవించింది. తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు 108 సిబ్బంది ఇఎం టి.శ్రీహరి, పైలెట్ చింతకుంట నర్సింహారెడ్డి తెలిపారు.

## మోటర్‌బైక్‌ను ఢీకొన్న కారు

**ఆత్మకూరు,డిసెంబరు14(ప్రభాతవార్త:** ఆత్మకూరు లోని ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఆత్మకూరు మండలం బి.చిరువెళ్ళకు చెందిన మాధవ, మనోజలు ఆత్మకూరులోని గురుకుల పాఠశాలలో చదువుతున్న తమ చిన్న కుమార్తె వద్దకు వెళ్ళారు. ఆదివారం కావడంతో ఇంటి నుంచి తీసుకెళ్ళిన భోజనం తమ బిడ్డకు తినిపించారు. తిరిగి ఇంటికి బైక్‌పై వెళుతుండగా కడప వైపు నుండి నెల్లూరుకు వస్తున్న ఇన్నోవా కారు ఢీకొట్టింది. దాంతో భార్యాభర్తలిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డ ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**దగదర్తి, డిసెంబర్ 14, ప్రభాత వార్త :** దగదర్తి మండల ప్రాంత మైన ఉలవపాళ్ళ జాతీయ రహదారిపై క్రాస్ రోడ్డు వద్ద ప్రమా దం చోటు చేసుకుంది. ఆదివారం ఆగి ఉన్న కంటైనర్ లారీని మోటార్ బైక్ ఢీకొనడ ంతో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై జంపాని కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని హైవే అంబులెన్స్ ద్వారా నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు చెప్పిన సమాచారం మేరకు అతని పేరు కోమరి నరసింహులు ఉలవపాడు మండలం పెద్ద పట్టపాలెంకి చెందిన వ్యక్తిగా చెబుతున్నారు. తలకి, పొట్ట భాగంలో గాయాలై అతను పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. అదే ప్రదేశంలో వల్లెపు సురేష్ అనే వ్యక్తి మద్యం సేవించి ఎక్సెల్ బైక్ పైన పోతున్న మద్యం మత్తులో చూసుకోకుండా క్రాస్ తిరగటం కారు వచ్చి ఢీకొట్టిందని అతని కాలు విరిగినట్టు చెప్తున్నారు. అతని గ్రామం ముసునూరు వడ్డీ పాలెం అతని మూగవాడ అని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపని కుమార్ తెలియజేశారు.

## కొత్తూరు గ్రామంలో పర్యావరణంపై గ్రీన్ రన్ కార్యక్రమం



**బిట్రగుంట డిసెంబర్ 14 ప్రభాతవార్త:** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామంలో ఆదివారం గ్రీన్‌రన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పర్యా వరణం పచ్చదనాని కాపాడేందుకు గ్రామ ప్రజలకు పచ్చని చెట్లు శ్రీగంధం మరియు ఎర్రచందనం విత్తనాలని గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వహకురాలు పసుపులేటి లక్ష్మి, మండలం బిజెపి అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్తదితరులు పాల్గొని పర్యావరణం పై ప్రజలకు అవగాహన కల్పించారు.

## ఇరిగేషన్ పనుల బిల్లులపై సిబిఐ విచారణ జరిపించాలి



**పొదలకూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** ఇరిగేషన్ పనుల బిల్లులపై సిబిఐ విచారణ జరిపించే దమ్ము, ధైర్యం ఎమ్మెల్యే సోమిరెడ్డికి ఉందా అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సవాళ్ విసిరారు. ఆదివారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పొదలకూరు మండలం నల్లపాలెం గ్రామంలో పర్యటించి రైతులతో కలిసి పలు విషయాలు చిర్చించారు. అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నంది రమణారెడ్డికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతూ సోమిరెడ్డి తన మాటల్లో నిజాయితీ నిరూపించుకోవడానికి షట్టర్లు బిగించకుండా దొంగ బిల్లులు చేసుకున్నారంటూ వ్యాఖ్యలు చేయడం మాని, పూర్తిస్థాయి విచారణ జరిపించి, దోషులైన వారిపై చర్యలు తీసుకునే దమ్ముందా అని ప్రశ్నిస్తున్నామన్నారు. సోమిరెడ్డి లాంటి బజారు వెధవలు కూసే కూతలను పట్టించుకోము కానీ, సోమిరెడ్డి అవినీతిని మాత్రం ఎండగడుతూనే ఉంటామన్నారు. సోమిరెడ్డి తనకు అనుకూలంగా ఉన్న అధికారుల చేత విజిలెన్స్ నివేదికలు తాను కోరుకున్నట్లు తయారు చేసుకుంటున్నందుకు సిబిఐ విచారణకు డిమాండ్ చేస్తే, మూసుకొని పారిపోతున్నాడన్నారు. కాకుటూరు శివాలయం భూములను సోమిరెడ్డి లేఔట్ యజమానులకు అమ్మేసి, దేవుడికే శఠగోపం పెట్టిన వాడికి, ప్రజలు ఒక లెక్క కాదన్నారు. సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకు గొలగమూడి రోడ్డులో సంతను నెలకొల్పి, నెలకు 5 లక్షల రూపాయలు వసూలు చేస్తూ, అక్కడ గోవులను అమ్ముకునేవారికి వంతపాడుతూ, గోవధను ప్రోత్స హించడం లాంటి పాపాలకు పాల్పడుతున్నారని అన్నారు. సోమిరెడ్డి ఇసుక, గ్రావెల్, మట్టి, బూడిద మాఫియాలు పెట్రేగిపోతూ, ప్రకృతి సంపదను దోచుకుంటూ, ప్రతినెల కోట్లాది రూపాయలు గడిస్తున్నాడు.సోమిరెడ్డి బ్రాందీ షాపుల్లో కమీషన్లు తీసుకుంటూ, సర్వేపల్లిలోని ప్రతి బెల్టు షాపు నుండి మాముళ్లు దండుకుంటున్నారన్నారు. సోమిరెడ్డి పనులు చేయకుండానే, మొంథా తుఫాను పేరిట 16 కోట్ల 90 లక్షల రూపాయలు దోచుకునేందుకు రంగం సిద్ధం చేశాడన్నారు. సోమిరెడ్డి మొంథా తుఫానులో నామమాత్రంగా పనులు చేసి, 16 కోట్ల 90 లక్షల రూపాయలు దోచుకునేందుకు ప్లాన్ వేసి, మరలా దిత్వా తుఫానులో కోట్ల రూపాయల పనుల మంజూరుకు ప్రయత్నిస్తూ, రైతులను అడ్డుపెట్టుకొని కోట్లాది రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు.ఇరిగేషన్ పనులలో జరిగిన అవినీతితో పాటు, సోమిరెడ్డి అవినీతిపై వివరాలు సేకరించి, ప్రతి ఊరు, ప్రతివాడ రైతులు ప్రజల సమక్షంలో సభలు ఏర్పాటు చేసి వివరిస్తామన్నారు. సోమిరెడ్డి లాంటి ఉడతలు పట్టేవాడి బెదిరింపులకు భయపడే పిరికివాళ్లు ఎవరూ లేరన్నారు. సోమిరెడ్డి నిన్న చేసిన ఆరోపణలకు కట్టుబడి, కనీసం షట్టర్ పనుల మంజూరు, పనిచేసిన కాంట్రాక్టర్లు, బిల్లులు చేసిన ఇంజనీర్ల పైన అయిన సిబిఐ విచారణ జరిపించగలడా అని ఏద్దేవ చేసారు. సోమిరెడ్డి నీచమైన ఆలోచన చూస్తుంటే, సోమిరెడ్డి కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి, వారి నుండి పర్సంటేజీలు రాబట్టుకునే పనిలో ఉన్నట్లున్నాడన్నారు. సోమిరెడ్డికి సర్వేపల్లిలో వ్యాపార కార్యకలాపాలు చేసే ప్రతి ఒక్కరూ, నెలవారి కప్పం కట్టాల్సిందే అన్నారు. సోమిరెడ్డి బూడిద బంకర్ల నుండి 300 రూపాయల చొప్పున దారి దోపిడీకి పాల్పడుతూ, పామాయిల్ అసోసియేషన్ ద్వారా కోట్లాది రూపాయలు పోగేసుకుంటున్నాడన్నారు. సోమిరెడ్డి ఈనాడు, ఆంధ్రజ్యోతి రిపోర్టర్లను బెదిరించినట్లే, సాక్షి రిపోర్టర్లను కూడా బెదిరించబోయి పరువు పోగొట్టుకున్నాడు.సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకుల అవినీతిని, సోమిరెడ్డికి వంతపాడిన అధికారులపైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్రామాల్లో, రైతుల సమక్షంలోనే బహిరంగ విచారణ చేపట్టి అవినీతిని రుజువు చేసి, చర్యలు చేపడుతామన్నారు. ఇరిగేషన్ పనుల దొంగ బిల్లులలో సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకుతో పాటు, ఎంత మంది ఇంజినీర్లు జైళ్లకు వెళ్తారో ప్రజలే చూస్తారన్నారు. ఇరిగేషన్ పనుల దొంగ బిల్లులకు సంబంధించి, పదవి విరమణ చేసిన అధికారులైనా, అవినీతి రుజువైతే, శిక్షకు గురికాక తప్పదన్నారు. సర్వేపల్లి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, ఏ అవసరం వచ్చినా కాపలాదారుడిగా వ్యవహరిస్తానని మనవి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 16న శింగమనేనిపల్లెలో గ్రామసభ

**వలేటివారిపాలెం డిసెంబరు 14, ప్రభాతవార్త :** మండలంలోని సింగమనేని పల్లె గ్రామంలో ఈ నెల 16వతేదీ మంగళవారం "ఒక గ్రామము ఒక నెల నాలుగు సందర్శనలు" అనే కార్యక్రమము నిర్వహిస్తున్నట్లు స్దానిక తహసిల్దార్ నయీం అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.రెవిన్యూ, మండలపరిషత్, పోలీస్,దేవాదాయ శాఖల ఆధ్వర్యంలో జరిగే ఈ గ్రామసభ ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంభందించి శాశ్వత పరిష్కారానికి ప్రాదాన్యత ఇవ్వనున్నారు. .కావున సింగమనేనిపల్లె రెవెన్యూ గ్రామపరిధిలోని ప్రజలందరూ ఈగ్రామసభలో పాల్గొని మీ యొక్క భూసమస్యలను సంభందించిన రెవెన్యూ అధికారులదృష్టికి తీసుకు వచ్చి మీ సమస్యలను పరిష్కరించుకోవలసిందిగా తహసిల్దార్ ఆ ప్రకటనలో కోరారు.

## అభివృద్ధి పేరుతో విధ్వంసం

**ఉదయగిరి, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** అధికారులు మార్గదర్శకులుగా ఉండాలి. ప్రభుత్వ ఉద్దేశాలు చట్టాలు ప్రజలకు తెలిసేలా చేయాలి. వోల్టా చట్టం ఒకటి అమలులో ఉందని తెలిసినప్పటికి కొన్ని సంవత్సరాల పచ్చటి వృక్షాలను నేలకు కూల్చి అభివృద్ధి పేరుతో విధ్వంసం సృష్టించిన సంఘటన ఉదయగిరి మండల పరిషత్ కార్యాలయంలో చోటు చేసుకుంది. మండల పరిషత్ కార్యాలయం ముందు ఎన్నో సంవత్సరాల వయస్సు కలిగిన ఒక వేప చెట్టు దానికి అరుగు ఉండేది. దారితో పాటు అనేక చెట్లు చల్లటి నీడనిస్తూ పర్యావరణానికి వెన్నుదన్నుగా నిలిచి ఉండేవి. అయితే మండల పరిషత్ కార్యాలయం పాత గోడలపై నూతన భవనం నిర్మించే క్రమంలో కార్యాలయం ముందు ఉన్న చెట్టు తొలగించడం ఎంత వరకు సమంజసం అనేది అధికారులకే తెలియాలి. చెట్లు ఎందుకు అడ్డం వచ్చాయి. వాటి వలన నష్టం ఏమిటి అనేది కూడా అధికారులకే తెలియాలని స్థానికులు అంటున్నారు. వోల్టా చట్టం ప్రకారం ఇంట్లో మనం పెంచుకున్న చెట్టు నరికిన కూడా నేరమే అవుతుంది. ముందుగా పది మొక్కలు నాటి అవి బ్రతికిన తర్వాత వృ క్షాలుగా ఎదుగుతాయి అన్న నమ్మకం వచ్చిన తర్వాత నిజంగా అడ్డుగా ఉంటే వృక్షాన్ని తొలగించవచ్చు. అదేమీ లేకుండా ఇష్టారాజ్యంగా కనీసం వేలంపాట కూడా వేయకుండా వృక్షాలను నరికి కూకటివేలతో సహ పెకలించడం అభివృద్ధి అంటారా లేక విధ్వంసం అంటారా అని ప్రశ్నిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం చుట్టు పక్కల హౌసింగ్, ఉపాధి హామీ పథక కార్యాలయం, అంగన్‌వాడీ, మండల విద్యాశాఖాధికారి కార్యాలయం, పంచాయతీ రాజ్, అగ్రికల్చర్, వీటితో పాటు పొదుపు కార్యాలయం కూడా ఉంది.ఏ కార్యాల యంలో సమావేశాలు జరిగిన అక్కడికి వచ్చిన పొదుపు సభ్యులు కానీ, ఉద్యోగస్తులు కానీ ఆచల్లటి నీడ కింద సేద తీరేవారు, ఇప్పుడు ప్రజలకు నిలువ నీడ లేకుండా చేసిన అధికారులపై ఉన్నతాధికారులు ఏరక మైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## రైతులకు నాణ్యమైన సీడ్



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** మండలంలోని కోడూరు బీచ్ రహదారి మార్గంలో ఆదివారం జేజే మెరిన్ ఆక్వా సీడ్ సరఫరా కేంద్రాన్ని ప్రారంభించినట్లు కంపెనీ ప్రతినిధి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాండిచ్చేరి సీడ్‌కు దీటుగా నాణ్యత ప్రమాణాలతో రైతాంగానికి మంచి సీడును అందించడమే మా లక్ష్యం అని స్పష్టం చేశారు. గోల్డెన్ ఈస్ట్ కోస్ట్ వంటి ప్రముఖ కంపెనీల తరహాలో అవసరమైన అన్ని అనుమతులు, లైసెన్సులు పొందిన తర్వాతే సీడ్‌ను సరఫరా చేస్తున్నాం. 100 శాతం నాణ్యత కలిగిన సీడ్‌ను రైతులకు అందిస్తాం అని ఆయన అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి, 2026 జనవరి మొదటి వారంలో జేజే హేచరీ ద్వారా సీడ్ సరఫరా ప్రారంభమ వుతుందని తెలిపారు. అవసరమైన వివరాల కోసం రైతులు కంపెనీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నెల్లూరు సునీల్ కుమార్‌ను 9293952238 నంబర్‌లో సంప్రదించ వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ భాగస్వాములు కే.కొండయ్య, జి. శీనయ్యతో పాటు నెల్లూరు సునీల్ కే.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రాణ రక్షణే లక్ష్యం.. రోడ్డు భద్రతే బాధ్యత



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** మండలంలోని కోడూరు బీచ్‌కు వెళ్లే రహదారి మార్గంలో ప్రమాదాల నివారణే లక్ష్యంగా తోటపల్లి గూడూరు ఎస్సై వీరేంద్రబాబు వాహనదారులకు కీలక సూచనలు చేశారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేకంగా ఆదివారాల్లో కోడూరు బీచ్‌కు పర్యాటకుల రద్దీ అధికంగా ఉండటంతో వాహనదారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీయవచ్చని హెచ్చరించారు. ఈసందర్భంగా ఎస్సై వీరేంద్రబాబు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి ట్రిబుల్ డ్రైవింగ్‌కు పూర్తిస్థాయి నిషేధం మైనర్ పిల్లలకు వాహనాలు అప్పగించకూడదు వేగ నియంత్రణ పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలి వాహనదారుల సహకారంతోనే రహదారి భద్రత సాధ్యమవుతుందని ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు క్రమం తప్పకుండా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ భద్రతను దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మన పినాకిని సత్యగ్రహ గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



**ఇందుకూరుపేట, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** మన పినాకిని సత్యగ్రహ గాంధీ ఆశ్రమంలో సర్వ మత ప్రార్థనలు ఆదివారం జరిగాయి. ఈ కార్య క్రమంలో ముందుగా ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మా గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రము, నూలుమాల సమర్పించారు. ఆశ్రమ స్థల దాత పోనక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రం, నూలుమాల సమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు మహాత్మగాంధీ యొక్క జీవిత విశేషాలు గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్ఫూర్తితో దొడ్ల మల్లిఖార్జున



**ఇందుకూరుపేట, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలం కుడితిపాలెంలో కాకర్ల దిబ్బ స్థాపించిన అమ్మ చారిటబుల్ ట్రస్టు తరుపున 10 కుటుంబాలకు ప్రధాన మంత్రి ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్స్ ఇవ్వడం జరిగింది. ముఖ్య అతిధులుగా ఏపీ స్టేట్ ఎంఎస్ఎంఈ డైరక్టర్ రావెళ్ళ వీరేంద్ర నాయుడు పాల్గొని మాట్లాడుతూ పేదల కుటుంబాలకు ఉజ్వల యోజన ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమం అమ్మ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు దొడ్ల మల్లిఖార్జున ఆధ్వర్యంలో పది మంది గిరిజన కుటుంబాలకు పంపిణీ జరిగింది. కొవ్వూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఆదర్శంగా తీసుకుని ఈ కార్యక్రమాలు దొడ్ల మల్లిఖార్జున చేస్తున్నాడు. నక్షత్ర స్కూల్ ఎండీ జీవన్ వచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు అప్పాని శ్రీనివాసులు, మండల కన్వీనర్ ఎస్‌కే ఇస్మాయిల్, గ్రామ ఉపాధ్యక్షులు వీరారెడ్డి, గ్రామ కార్యదర్శి వలుమూడి చెన్నయ్య, బీజేపీ మండల కార్యదర్శి గుమ్మడి పరందామయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి వీరి ప్రవీణ్ పాల్గొన్నారు.

## కండలేరులో 60.510 టీయంసీల నీటిమట్టం



**కండలేరుడ్యాం(రాపూరు),డిసెంబరు14 ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జలాశయంలో ఆదివారం ఉదయానికి 60.510 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఎఇ అనీల్ కుమార్ తెలిపారు .సోమశిల..కండలేరు వరద కాలువ ద్వారా 1750 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వస్తుండగా జలాశయం నుండి హైలెవల్ కెనాల్ ద్వారా 100 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, కండలేరు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 1260 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1410 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## బీజేపీ కార్యాలయం ప్రారంభం



**వలేటివారిపాలెం డిసెంబరు 14, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో ఆదివారం బీజేపీ కార్యాలయంను నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టమనేని హరిబాబు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీని మండలంలో బలోపేతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కందుకూర్ పట్టణ అధ్యక్షులు ప్రసాద్, కందుకూరు మున్సిపాలిటీ మరియు టౌన్ కన్వీనర్ మణి, విశ్వహిందూ పరిషత్ కావలి అధ్యక్షుడు ఉప్పుటూరి కొండపనాయుడు, లింగసముద్రం కన్వీనర్ ఏడుకొండలు,మండల బిజెపి అధ్యక్షుడు మతకాని వీర సుధాకర్ మరియు వైకుంఠం,ముతకని బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు

## విధులకు ఎగనామం పెడుతున్న ఉపాధ్యాయుడిపై విచారణ



**వింజమూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలోని జనార్ధనపురం గ్రామ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు విధులకు ఎగనామం పెడుతున్న నేపథ్యంలో వార్త దినపత్రికలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో పేదలకు ప్రభుత్వ విద్య దూరం కథనాలకు స్పందించిన జిల్లా విద్యాశాఖా ధికారి కావలి డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్‌ను విచారణకు ఆదివారం పంపారు. విచారణ అధికారి ఎం.హరిప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వాస్తవాలు తెలుసుకోవాల్సిన ఆయన కార్యాలయంలో కూర్చొని కార్యాలయం సిబ్బందితో పాఠశాల రికార్డులు తెప్పించుకుని పరిశీలించడం తీరు చూస్తే ఇది కేవలం కంటి తుడుపు చర్యగా మిగిలిపోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచారణ సమయంలో ఉపాధ్యాయుడు, ఎంఈఓ-2 కోసం డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్ చాలా సమయం వేచి ఉన్నారు. ఉపాధ్యాయుడు, ఎంఈఓ-2 ఎంఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం డిప్యూటీ డీఈఓ ఎంఈఓ-1, ఎంఈఓ-2 ఉపాధ్యాయుడును విచారించారు. వారి నుంచి లిఖిత పూర్వకంగా సంజాయిషీ ఉత్తరం తీసుకున్నారు. అనంతరం డిప్యూటీ డీఈఓ విలేకర్లతో మాట్లాడుతూ డీఈఓ ఆదేశాల మేరకు ప్రాథమిక విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. తన పూర్తి నివేదికను డీఈఓకి పంపుతామని తదుపరి చర్యలు డీఈఓ తీసుకుంటారని చెప్పారు. అయితే విచారణ ఎదుర్కొంటున్న సమయంలో ఉపాధ్యాయుడు కొరకు గతంలో విశ్రాంత ఎంఈఓ గా ఉన్న వ్యక్తి, ఎంఈఓ-2 ఒకల్తా పుచ్చుకొని ఉపాధ్యాయుడికి ఏం కాదు అంటూ అభయమిస్తున్నారని ఉపాధ్యాయుల వర్గం చర్చించుకుంటున్నారు. విధులకు ఎగనామం పెడుతున్న ఉపాధ్యాయుడిపై చర్యలు ఉంటాయా లేదా అన్నది వేచి చూడాల్సిందే. ఈ విచారణ వాస్తవంగా జరుగుతుందా లేదా గ్రామస్తులు కోసం జరుగుతుందా అనే విషయాల్లో ఆ జనార్ధనపురం గ్రామస్తులు సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. నిజాయితీగా విచారణ జరిపి మా పిల్లలకు ప్రభుత్వ విద్య అందే విధంగా న్యాయం చేయాలని ఆ గ్రామస్తులు కూడా కోరుకుంటున్నారు. విద్యాశాఖ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వాళ్లు వేడుకుంటున్నారు.

## నేటి మోడీ పాలన ఆనాటి వాజయ్‌పేయి సంస్కరణలే

**- నేడు అటల్ బిహారి వాజ్ పేయి విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి**



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పేయి శత జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో వాజ్ పేయి విగ్రహ విష్కరణలను చేపడుతున్నామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరులోని బీజేపీ జిల్లా ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాటి వాజ్‌పేయి ప్రవేశపెట్టిన సంస్కరణలే నేడు మోడీ అమలు చేస్తున్నారని వెల్లడించారు. ఆయన అధికారం చేపట్టాక విలువలు విశ్వసనీయతకు ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. తొలుత 11 నెలల పాలనలో ఒక్క ఓటు చేజారితే ప్రభుత్వం అధికారం కోల్పోతుందని తెలిసి కూడా విలువలకు కట్టుబడి పార్టీ అధినాయకత్వం ఆ ఓటును కొనుగోలు చేస్తామని చెప్పినా, డబ్బుతో ఓట్లు కొనడం కాదు ప్రజల చేత మన్ననలు పొందేలా పరిపాలన సాగించాలని ఆలోచన చేసిన గొప్ప వ్యక్తిగా వాజ్‌పేయి నిలిచారని వివరించారు. ఈనాడు జాతీయ రహదారుల్లో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అడ్డంకులు లేని ప్రయాణం మనం సాగిస్తున్నామంటే అది వాజ్‌పేయి ఘనతేనన్నారు. దేశంలో ప్రతి ఒక్కరికి కూడుగుడ్డ తాగునీరు సమస్యలు రాకుండా సంస్కరణలు ప్రవేశపెట్టి, పేదవాడు కడుపునిండా తినాలన్నా సదుద్దేశంతో ఉపాధి హామీని రూపకల్పన చేశారని వివరించారు. చేపట్టిన బస్సు యాత్ర పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ నిర్ణయమేనని గుర్తు చేశారు. జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో ముందుకు నడిచిన వ్యక్తులుగా ఈనాడు మాజీ ప్రధాని వాజ్‌పేయిని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకునేలా అన్ని జిల్లాల్లో విగ్రహావిష్కరణలు చేపట్టడం జరుగుతుందన్నారు. నేడు జరిగే విగ్రహావిష్కరణకు పార్టీలకు అతీతంగా కూటమి నేతలు, కార్యకర్తలు వేలాదిగా విచ్చేసి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి, పార్టీ నేతలు మండ్ల ఈశ్వరయ్య, ఢిల్లీ టీటీడీ బోర్డు మెంబర్ సుమంత్‌రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ మాల్యాద్రి, రవిచంద్రారెడ్డి, జిల్లా మీడియా ఇన్‌చార్జి సి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు నెల్లూరులో మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహావిష్కరణ



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారి వాజ్ పేయి శత జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ చేపట్టిన బస్సు యాత్ర నేడు ఉదయం 9.30గంటలకు నెల్లూరుకు చేరుకుంటుంది. స్థానిక అయ్యప్ప గుడి వద్ద నగరంలోకి ప్రవేశించి బస్సు యాత్ర సందర్భంగా కూటమి శ్రేణులు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని చేపట్టనున్నారు. ఈ ర్యాలీ నగరంలోని వేదాయపాలెం, కేవీఆర్ మీదుగా హరనాథపురం జంక్షన్‌కు చేరుకుంటుంది. అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన వాజ్‌పేయి విగ్రహావిష్కరణ జరగనుంది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ తదితరులు పాల్గొని ఉదయం 11గంటలకు విగ్రహావిష్కరణను గావించనున్నారు. ఆదివారం హరనాథపురం కూడలిలో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ పనులు, బహిరంగ సభ వేదికను బీజేపీ అధికార ప్రతినిధి వాకాటి నారాయణరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. బహిరంగ సభ విజయవంతం అయ్యేలా పార్టీ నాయకత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వాజ్‌పేయి ఫొటో గ్యాలరీని తిలకించారు. బహిరంగ సభను జయప్రదం చేయాలని కూటమి నేతలు కార్యకర్తలకు వివరించారు.

## ఎమ్మెల్యే సోమిరెడ్డికి ఘన స్వాగతం పలికిన స్థానిక నాయకులు, తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ



**ముత్తుకూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** మండలంలోని కృష్ణపట్నంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కామాక్షి సమేత శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయం, శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానాల చైర్మన్‌గా మామిడాల శ్రీనివాసులు ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిధిగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదివారం విచ్చేసారు. ఆయనకు స్థానిక టిడిపి నాయకులు, మండల తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ ఘన స్వాగతం పలికారు. ప్రమాణ స్వీకారం చేసిన పాలక మండలి సభ్యులకు రాగాల శివకృష్ణ శాలువలతో సత్కరించారు. అలాగే స్థానిక సీనియర్ బొనిగి ఆనందయ్య కూడా పాలక మండలి సభ్యులను సత్కరించి, అభినందనలు తెలిపారు.

## గ్రామస్తుల నోట భరత్ రెడ్డి మాట



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** మండలంలోని పొట్లపూడి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సహా అన్ని వర్గాల ప్రజలు భరత్ రెడ్డి సేవలను ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా అణగారిన వర్గాల పట్ల ఆయన చూపుతున్న సానుభూతి, సేవా దృక్పథం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా శాసనసభ్యులు సోమిరెడ్డి సహకారంతో భరత్ కుమార్ రెడ్డి దగ్గరుండి నమోదు కార్యక్రమాలు చేపడుతూ, ప్రజలకు మార్గనిర్దేశం చేస్తున్నారు. "గ్రామస్తులకు ఏదైనా ఆపద వస్తే నేనున్నాను అంటూ ముందుండి ఆదుకోవడం ఆయనను ప్రత్యేకతగా ప్రజలు పేర్కొంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా, శాసనసభ్యులు సోమిరెడ్డి నాయ కత్వంలో గ్రామాభివృద్ధి దిశగా పలు కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లడంలో భరత్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని గ్రామ పెద్దలు తెలిపారు. పార్టీని నమ్ముకున్న నిజాయితీగల కార్యకర్తగా ఆయనకు శాసనసభ్యులు సోమిరెడ్డిలో ప్రత్యేక గుర్తింపు ఉందని ప్రజలు అంటున్నారు. అలాగే వెంకన్నపాలెం నీటి సంఘ అధ్యక్షులుగా 2014 నుంచి 2019 వరకు రైతుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి, సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తిగా భరత్ కుమార్ రెడ్డికి మంచి పేరు ఉందని రైతులు గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాలను కాగితాలకే పరిమితం కాకుండా ప్రజల గడప దాకా తీసుకెళ్లడంలో వేలూరు భరత్ రెడ్డి దూసుకెళ్తున్నారని, వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన చురుకుదనం గ్రామాభివృద్ధికి బాటలు వేస్తోందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. రానున్న ఎన్నికల్లో భరత్ రెడ్డిని సర్పంచ్ అభ్యర్థిగా గెలిపించుకుంటే, పొట్లపూడి గ్రామం అభివృద్ధిలో మరింత ముందుకు దూసుకెళ్తుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ అన్ని వర్గాల ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. అన్ని కులాలతో కలిసిమెలిసి ఉండే స్వభావం, సేవే లక్ష్యంగా పనిచేసే మనస్తత్వం భరత్ రెడ్డిని గ్రామానికి భవిష్యత్ నాయకుడిగా తీర్చిదిద్దుతుందని వారు ప్రశంసలతో పేర్కొన్నారు.

## నవజీవన్ పౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర వస్తువులు



**రాపూరు,డిసెంబరు14(ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరు పంచాయితీ పరిధిలోని అంజనేయ పురంలో వున్న పేదలకు ఆదివారం వెంకటగిరికి చెందిన నవజీవన్ పౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరి ఈ కాలనీలోని సుమారు 58 కుటుంబాల వారు అనేక ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న నవజీవన్ పౌండేషన్ వ్యవస్థాపకులు కాలువపల్లి సహదేవయ్య వారిని ఆదుకునేందుకు అంజనేయపురంకు చేరుకొని రాపూరు ఎస్ఐ యం. వెంకట రాజేష్ చేతుల మీదుగా వారికి సరకులు ఆందజేశారు. ఈ సందర్భంగా సహదేవయ్య మాట్లాడుతూ పేదలకు సహాయ సహకారాలను గత 30 సంవత్సరాలుగా అందిస్తున్నట్లు తెలిపారు. తమ పౌండేషన్ ద్వారా నెల్లూరు జిల్లాలో సుమారు 2000 మంది పేద కుటుంబాలకు ప్రత్యేక శిబిరాల ద్వారా చదువుకు కావలసిన తోడ్పాటును అందస్తున్నట్లు చెప్పారు. అంజనేయపురంలోని పేదల స్థితిని ఇక్కడ పనిచేస్తున్న కానిస్టేబుల్ గజరా శ్రీనివాసులు తెలపడంతో వారిని ఆదుకునేందుకు ఒక్కో కుటుంబానికి 10 రోజులుకు సరిపడా నిత్యవసర సరుకులు ఆందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా అంజనేయపురంలోని పేదలకు నిత్యవసర సరకులు, దుప్పట్లు పంపిణీ చేసిన నవజీవన్ పౌండేషన్ నిర్వాహకులను రాపూరు ఎస్ఐ యం. వెంకట రాజేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పౌండేషన్ కో ఆర్డినేటర్‌లు టి. శ్రీనివాసులు, రమేష్, సుబ్బారావు తదితరులున్నారు.

## నెల్లూరుకు రావాలని మేకపాటి పిలుపు



**ఉదయగిరి, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమంకు సంబంధించి గవర్నర్‌కి సమర్పించాల్సి లెటర్స్ రాష్ట్ర కార్యాలయానికి పంపవలసి ఉన్నందున 15వ తేదీన ఉదయం 10గంటలకు నెల్లూరు నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంతరం ర్యాలీగా వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని అక్కడ నుంచి కోటి సంతకాల ప్రతులు ఉన్న వాహనంను జెండా ఊపి తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించడం జరుగుతుంది, కావున ఈ కార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల కన్వీనర్‌లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు.

